

పీఎంశ్రీ పథకానికి 35 పాఠశాలలు ఎంపిక

» ఎంపీ సీఎం రమేశ్ వెల్లడి

అనకాపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద జిల్లాలో 35 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని ఎంపీ సీఎం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 51 పాఠశాలలను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని కోరగా తొలిదశలో భాగంగా 35 పాఠశాలలను ఎంపిక చేసిందని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఆధునాతన మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

- 150 గజాలలోపు స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్
- కుటుంబంలో మహిళ పేరుతో పట్టా
- గ్రామ/వార్డు సచివాలయాల్లో అర్జీల స్వీకరణ



ప్రభుత్వ స్థలంలో నివాసం వుంటున్న వారి ఇటువంటి ఇళ్లనే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుంది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం వుంటున్న పేదలకు ఆయా స్థలాల క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనిపై తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలని ఆదేశించారు.

గత వైసీపీ ప్రభుత్వం సొంత పార్టీ వారికి మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించింది. అప్పటికే ప్రభుత్వ స్థలాల్లో పాకలు, రేకుల షెడ్లు నిర్మించుకుని నివాసం వుంటున్నవారి గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటువంటి వారి ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టింది. దారిద్ర్యరేఖకు దిగువ నున్న కుటుంబాలకు మాత్రమే దీనిని అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలకు మించకూడదు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు వుంటే ఈ పథకానికి అనర్హులు. ఇంకా పది ఎకరాలకు మించి మెట్ట, ఐదు ఎకరాలకు మించి మాగాణి భూమి వున్నా అనర్హులుగా పరిగణిస్తారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, కార్లు, వ్యవసాయం కోసం వినియోగించే ట్రాక్టర్లు, సరకు రవాణా ట్రక్కులున్న వారికి కూడా ఈ పథకం వర్తించదు. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబరు 15వ తేదీకి ముందు నివాసం వుంటున్న వారికి మాత్రమే ప్రభుత్వం క్రమబద్ధీకరణ అవకాశం కల్పించింది. 150 గజాలలోపు స్థలంలో నివాసం వుంటుంటే ప్రభుత్వానికి ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. 150 గజాల నుంచి 451 గజాల వరకు గల రిజిస్ట్రేషన్ విలువలో 50 శాతం చెల్లించాల్సి వుంటుంది. ప్రభుత్వ స్థలాల్లో ఇటుకల గోడపై సిమెంట్ రేకులతో వేసిన షెడ్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. ఆ ఇంటిలో నివాసం వుంటున్న కుటుంబానికి రాష్ట్రంలో ... మిగతా 8వ పేజీలో

వేగంగా పీ-4 సర్వే

- పల్లె పండుగ రోడ్ల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వ ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పీ-4) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ డీఈలు, జేఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాతవరం, కోటవురట్ల మండలాల్లో సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బీటీ /సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ శనివారం ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలని, తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలని చెప్పారు. పాఠశాలల ప్రహరీ గోడలు, రైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్డులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా లేకుండా చూడాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడం, రిపేరు చేయడం, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చల్లడం, బోరు బావులను బాగు ... మిగతా 8వ పేజీలో

స్వామివారి దర్శనానికి క్యూ లైన్లలో భక్తులు. (ఇన్‌సెట్‌లో) స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



భక్త జన సంద్రం

గోవింద నామ స్మరణతో మార్మోగిన ఉపమాక క్షేత్రం

- స్వామివారి కల్యాణోత్సవాలకు తరలివచ్చిన భక్తులు
- స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చిన వెంకన్న



ఉపమాక వెంకన్నకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

ఉపమాక క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయం లోపల, బయట వున్న క్యూ లైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. క్యూ లైన్‌లోకి వచ్చిన తరువాత స్వామివారిని దర్శించుకోవడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టింది. కొండపై వున్న స్వామి నిజరూపాన్ని, కింద ఆలయంలో వున్న క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వర్ణాలంకరణలో వున్న స్వామివారిని భక్తులు దర్శించుకుని పులకించారు.

స్వర్ణాలంకరణలో శ్రీనివాసుడు

వజ్ర వైఢూర్యాలతో పొదిగిన బంగారు కిరీటం, బంగారు కంఠిలు, పచ్చల హారాలు, చింతాకుపతకం, కాసులపేర్లు, బంగారపు మిరియాల దండలు.. ఇంకా ఎన్నో వెలకట్టలేని పసిడి ఆభరణాలతోఉపమాక వేంకటేశ్వరస్వామి స్వర్ణభూషితుడై భక్తులకు అపూర్వ దర్శనమిచ్చారు. ఉభయదేవేరులతో కూడి స్వామివారి ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన హోం మంత్రి అనిత

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాల సందర్భంగా సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం మంత్రి ... మిగతా 8వ పేజీలో

బైక్‌ను ఢీకొన్న కారు
ఒకరి మృతి

మాడుగుల రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):



వేమగిరి రమేశ్‌బాబు (ఫైల్‌ఫొటో)

వేగంగా వెళుతున్న కారు, ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకి చెందిన వేమగిరి రమేశ్‌బాబు (47) టీవీ మెకానిక్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతని కుమార్తె సబ్బవరంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. ఇటీవల ఇంటికి వచ్చిన కుమార్తెను తిరిగి పాఠశాలలో దిగబెట్టడానికి సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై సబ్బవరం వెళ్లాడు. కుమార్తెను అక్కడ వదిలిపెట్టి తిరిగి పాడేరు బయలుదేరాడు. ఉదయం పదిన్నర గంటల సమయంలో తాటిపర్తి దాటిన తర్వాత గరికబంద సమీపానికి వచ్చే సరికి పాడేరు వైపు నుంచి వస్తున్న కారు, ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొన్నది. దీంతో రమేశ్‌బాబు కింద పడిపోయి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఇతని సోదరుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ తరగతులు

- 7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు
- 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.10
సహరి (బుధ)	4.53

గోవాడకు రూ.110 కోట్లు కేటాయించాలి

షుగర్ ఫ్యాక్టరీ ఉసురు తీయొద్దు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి వినతి



గోవాడ ఫ్యాక్టరీ యార్డులోకి వస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

చోడవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి వెంటనే రూ.110 కోట్లు కేటాయించాలని, ఫ్యాక్టరీని విక్రయించకుండా సహకార రంగంలోనే నడపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన షుగర్ ఫ్యాక్టరీ యార్డులో రైతులతో మాట్లాడారు. రాష్ట్రంలో సహకార రంగంలో నడుస్తున్న ఏకైక షుగర్ ఫ్యాక్టరీ ఉసురుతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు రూ.3 కోట్లు, కార్మికులకు రూ.2 కోట్ల వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. మొలాసిస్, ఇథనాల్ వంటి ఉప ఉత్పత్తులకు గిరాకీ ఉన్నప్పటికీ, వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం చేతకానితనమని అన్నారు. పారిశ్రామిక వేత్త అయిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడానికి కేంద్రం వద్ద తన పలుకుబడిని ఉపయోగించి నిధులు మంజూరుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఫ్యాక్టరీలో ఎండీ సన్యాసినాయుడుతో సమావేశమై ఫ్యాక్టరీ స్థితిగతులపై మాట్లాడారు. చెరకు రైతులకు డబ్బులు చెల్లించకపోవడం, చెరకు క్రషింగ్‌లో తరచూ అవాంతరాలపై ఎండీని అడిగి తెలుసుకున్నారు. తరువాత కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లోకనాథం, డి.వెంకన్న, చెరకు రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, గండి నాయనిబాబు, సీఐటీయూ నాయకులు కోటేశ్వరరావు, గూనూరు వరలక్ష్మి, వి.వి. శ్రీనివాసరావు, గంటా శ్రీరాం, ఎస్.వీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న పేదలు

ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్

ఎలమంచిలిలో రోజూ వెయ్యి మందికిపైగా ఆహారం

ఎలమంచిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలోని కొమ్మాయి గుండం వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు ప్రజల నుంచి రోజు రోజుకీ ఆదరణ పెరుగుతున్నది. కేవలం రూ.5కే కడుపు నిండా భోజనం పెడుతుండడంతో స్థానిక కార్మికులు, కూలీలు, శ్రామికులతోపాటు వివిధ పనులపై గ్రామాల నుంచి ఎలమంచిలి వచ్చే వారికి ఈ క్యాంటీన్ ఆసరాగా నిలుస్తున్నది. రోజూ సుమారు వెయ్యి మంది ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేస్తున్నారు. పేదల కడుపు నింపేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆహార పదార్థాలు రుచికరంగా వుండడం, క్యాంటీన్ నిర్వహణ బాగుండడంతో కొంతమంది మధ్యతరగతి ప్రజలు కూడా ఇక్కడ భోజనం చేయడానికి వస్తున్నారు. అయితే క్యాంటీన్‌లో భోజనాలు చేసేందుకు వస్తున్న వారు క్యూలైన్‌లో ఆరుబయట ఎండలో నిల్చోవాల్సి వస్తున్నది. టోకెన్ల కోసం క్యూలో ఎక్కువ సేపు నిలబడలేక వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిశీలించి క్యాంటీన్ బయట షెడ్డుగానీ, లేదా తాటిఆకులతో పాకగానీ వేయించాలని కోరుతున్నారు.



టోకెన్ తీసుకోవడానికి అన్న క్యాంటీన్ వద్ద క్యూలో నిల్చున్న స్థానికులు

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

నక్కపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

మాదకద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్తు నాశనం అవుతుందని, అందువల్ల విద్యార్థులు వీటికి దూరంగా వుండాలని హోం మంత్రి అనిత పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆరు నెలల్లోనే గంజాయి కేసుల్లో 500 మందిని అరెస్టు చేశామన్నారు.

గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను అరికట్టడానికి రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టెక్నాలజీని ఉపయోగించి గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని అన్నారు. మహిళలు, యువతులు, బాలికల రక్షణ కోసం శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, అందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మంత్రి అనిత సూచించారు.

గంజాయి నిర్మూలనకు టెక్నాలజీ వినియోగం

- మహిళలు, యువతుల రక్షణకు శక్తి యాప్
- హోం మంత్రి అనిత



మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో డీఐజీ గోపీనాథ్, ఎస్పీ తుహిన్ సిన్హా, రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు ఉన్నారు.

తల్లిదండ్రులు ఆడపిల్లలనే కాకుండా మగపిల్లలను కూడా క్రమశిక్షణతో పెంచాలని సూచించారు. రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవుతుందని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు పోలీస్ స్టేషన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కె.కుమారస్వామి, జి.అప్పన్న, లొద్దు రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిన ఉపమాక ఆలయ ప్రాంగణం

ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని మాఢ వీధుల్లో ఊరేగించారు.



గరుడాద్రిపై స్వామివారి నిజరూపాన్ని దర్శించుకోవడానికి వెళుతున్న భక్తులు



ఉపమాక మాఢవీధుల్లో పల్లకీలో ఉభయ దేవేరులతో ఊరేగుతున్న స్వామివారు



ఉపమాక ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు

నేడు 9 గ్రామాలకు విద్యుత్ అంతరాయం

నక్కపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు సబ్ స్టేషన్, గొడిచెర్ల ఫీడర్ పరిధిలో ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నందున 9 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ రాజశేఖర్, ఏఈ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చినదొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట,డొంకాడ, జి. జగన్నాథపురం, చీడిక, రేవెళ్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

15న దళితవాడలో రామాలయం పునఃప్రారంభం

మునగపాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత కాలనీలో పునఃనిర్మాణం చేసిన రామాలయాన్ని ఈనెల 15వ తేదీన ప్రారంభించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఇందుకు సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ప్రారంభోత్సవంతో పాటు సీతారామలక్ష్మణ, ఆంజనేయ, వినాయక, సాయినాథ్ విగ్రహాలు ప్రతిష్ఠా కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బోడకుర్తి గణేష్, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు.

14న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఎలమంచిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన నిర్మించిన ఆలయంలో ఈనెల 14వ తేదీన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్వర్గీయ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని కోరారు. ఈ నెల 12వ తేదీ నుంచి 3 రోజులుపాటు వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, 14వ తేదీ విగ్రహ ప్రతిష్ఠతోపాటు అన్న సమారాధన ఉంటుందని వారు తెలిపారు.

బెంగళూరు ప్రత్యేక రైలుకు ఎలమంచిలిలో హాల్ట్

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హోలీ ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ- ఎస్ఎంవీ బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులకు ఎలమంచిలిలో ఒక నిమిషంపాటు హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-బెంగళూరు (08549) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, తిరుగు ప్రయాణంలోని బెంగళూరు-విశాఖ (08550)కు ఈ నెల 17 నుంచి ఎలమంచిలి స్టేషన్‌లో హాల్ట్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

నేడు దిబ్బపాలెం నూకాలమ్మ పండగ

అచ్యుతాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం) నూకాలమ్మ పండగ మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ బైలపూడి శ్రీరామదాసు తెలిపారు. భక్తుల కోసం చలువ పందిళ్లు వేయడంతోపాటు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటుచేశామన్నారు. మంగళవారం తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోర పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

12న యువత పోరు

అచ్యుతాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు తెలిపారు. సోమవాసం స్థానిక పార్టీ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, నిరుద్యోగ యువకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈకార్యక్రమాన్ని ఏర్పాటుచేశామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు తక్షణం విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేలు భృతి ఇవ్వాలని, కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, పిన్నమరాజు వాసు, లాలం శ్రీనివాసరావు, పంచదార్ల పైడి రాజు, లాలం పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

మట్టితో దేవతామూర్తుల విగ్రహాలు

- ఆర్డర్ల మేరకు తయారీ
- డిగ్రీ చదివినా కుల వృత్తిని వదులుకోని వెంకటరమణ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలు చేయబోమంటున్న కళాకారుడు



రమణ చేతిలో రూపుదిద్దుకున్న దేవతామూర్తులు



మట్టితో శివలింగాన్ని తయారు చేస్తున్న వెంకటరమణ

ఎలమంచిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆ కళాకారుడి చేతిలో మట్టితో రూపుదిద్దుకుంటున్న దేవతామూర్తుల విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. భక్తుల ఆర్డర్ల మేరకు మట్టితో మాత్రమే దేవతామూర్తుల విగ్రహాలను తయారు చేయడం ఎలమంచిలి కొత్తపేట గ్రామానికి చెందిన వి.వెంకటరమణ ప్రత్యేకత. ఇటీవల ఓ భక్తుడి ఆర్డరు మేరకు తయారు చేస్తున్న శివలింగాకారం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అంతేకాకుండా ఆయన తయారు చేసిన సీతారామ,లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలు మరింత ఆకట్టుకుంటున్నాయి. తాతల కాలం నుంచి మట్టితో మాత్రమే విగ్రహాలు తయారు చేయడం ఆ కుటుంబం ప్రత్యేకత. అధిక డబ్బులు ఇస్తామన్నా సరే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు జోలికి వెళ్లమని, తన తాతల కాలం నుంచి పర్యావరణ ప్రేమికులు కావడంతో మట్టి విగ్రహాలు మాత్రమే తయారు చేస్తామని వెంకటరమణ చెబుతున్నాడు.

తాను చదివింది డిగ్రీ అయినప్పటికీ తాతల కాలం నుంచి వస్తున్న విగ్రహాల తయారీని వృత్తిగా చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. వినాయక చవితి, దసరా ఉత్సవాలు, శ్రీరామనవమి, కృష్ణాష్టమి వేడుకలు సమయంలో దేవతామూర్తుల మట్టి ప్రతిమలు తయారు చేయడం ఆయన ప్రత్యేకత. పక్క జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి కూడా విగ్రహాల కొనుగోలుకు వస్తుంటారు. మట్టి విగ్రహాలను తయారు చేయడంలో తనకెంతో ఆనందంగా ఉంటుందని కళాకారుడు రమణ అంటున్నాడు.

అధికంగా పురుగుల మందులు వాడొద్దు

- బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ నాగేంద్రప్రసాద్



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్

రాంబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పంటలకు విచక్షణా రహితగా పురుగుల మందులు వాడరాదని బీసీటీ కృషివిజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని మర్రిపాలెంలో ఆత్మవారి సౌజన్యంతో వరి పంటలో క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్ పురుగుల మందులు వాడడం వలన కలిగే నష్టాన్ని వివరించారు. పంటలకు అవసరాన్ని అనుసరించి అధికారులు చేసిన సిఫారసు మేరకు ఎరువులు, పురుగులు మందులు వాడుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి పి.విజేత మాట్లాడుతూ ప్రస్తుతం వరి గింజ పాలుపోసుకొనే దశలో ఉన్నందున ప్రొఫెనోపాస్, ప్రొఫికొనజోల మందులను పంటకు పిచికారీ చేసుకుంటే ఐదు రకాల పురుగులు, తెగుళ్లను నివారించవచ్చునన్నారు. ఎంపీఈఓ రామారావు, వీఏఏ మేఘన పాల్గొన్నారు.

ఇరువాడ సమీపంలో రసాయన వ్యర్థాలు



అట్టపెట్టెలతో పడేసిన రసాయన వ్యర్థాలు

- ఆందోళన చెందుతున్న గ్రామస్థులు

అచ్యుతాపురం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ గ్రామ శివారులో ఆదివారం కంపెనీల రసాయనిక వ్యర్థాలను వేయడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం ఇదే ప్రాంతంలో ఇలాంటి ప్రమాదకర రసాయ వ్యర్థాలు వేయడంతో 15 రోజుల తరువాత విపరీతమైన దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రాత్రి సమయంలో రసాయన వ్యర్థాలను అట్టపెట్టెలు, ప్లాస్టిక్ సంచిల్లో ప్యాక్‌చేసి సాయిబాబా తోట ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలోను, ఆర్కే టౌన్‌షిప్ వద్ద పడేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఇరువాడ గ్రామస్థులు కోరుతున్నారు.

పారిపల్లమ్మ పండగ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పారిపల్లిమ్మ అమ్మవారి పండగ పోస్టర్‌ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మునగపాక మండలం వాడ్రాపల్లిలో వెలసిన పారిపల్లమ్మ అమ్మవారి పండగ వాల్‌పోస్టర్‌ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం అచ్యుతాపురంలో గల తన నివాసంలో ఆవిష్కరించారు. ఈనెల 18న అమ్మవారి పండగను వైభవంగా జరపనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'లలితా ఫెర్రో కార్మికుల బకాయిలు చెల్లించాలి'



కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లో గల రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో కర్మాగారంలో కార్మికులు, ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించాలంటూ కార్మికులు, ఉద్యోగులు సోమవారం కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ రాము మాట్లాడుతూ బకాయిలు చెల్లించకపోవడంతో జనవరి 23 నుంచి కర్మాగారానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారన్నారు. బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని, లేదంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

అప్పారాయుడుపాలెంలో రామాలయం ప్రారంభం



భక్తుల పూజలందుకున్న సీతారాముల వారు

రాంబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారాయుడుపాలెంలో సోమవారం రామాలయాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పురోహితుల బృందం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారాములను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ నేతలు దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మునగపాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగవరం ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ నుంచి అచ్యుతాపురం వైపు వెళుతున్న కారు అచ్యుతాపురం నుంచి పరవాడ వైపు వస్తున్న బైక్ నాగవరం జంక్షన్ వద్ద ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి కాలుకు తీవ్ర గాయం అయ్యిందన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని చెప్పారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



ఆంజనేయస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేవీ పునరావాస కాలనీలో కొలువైన అభయాంజనేయస్వామివారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆంజనేయ స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ, పలువురు నేతలతో కలిసి స్వామివారిని దర్శించారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



చూచుకొండలో జరుగుతున్న వెంకన్న కల్యాణోత్సవం

మునగపాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణాలు వైభవంగా జరిగాయి. చూచుకొండ, వాడ్రాపల్లి, నాగులాపల్లి గ్రామాల్లో సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. వేడుకలతోపాటు అన్నసమారాధన కూడా నిర్వహించారు.

12న యువత పోరును విజయవంతం చేయండి

- వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్



యువత పోరు కరపత్రాన్ని ఆవిష్కరించిన బొడ్డేడ ప్రసాద్, వైసీపీ నేతలు

మునగపాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో యువత పోరు ప్రచార కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగులతో కలిసి కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు, కర్రి అబ్బాయినాయుడు, కాండ్రేగుల జగన్, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి గరగల ఊరేగింపు



కుమారపురంలో అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి 10: మండలంలోని కుమారపురంలో సోమవారం కనకదుర్గ అమ్మవారి గరగలను పల్లకిలో గ్రామస్థులు ఘనంగా ఊరేగించారు. ప్రతి ఏటా ఉపమాక ఏకాదశికి అమ్మవారి గరగలను పల్లకిలో ఊరేగించి రాత్రికి ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో పెట్టడం ఆనవాయితీ. అనంతరం మరునాడు గ్రామంలోకి తీసుకు వచ్చి కొత్త అమావాస్య వరకు 20 రోజులపాటు ప్రతీరోజూ గ్రామంలో నృత్యాలు చేస్తూ ఊరేగిస్తూ.. పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పసుపు కుంకుమలు, పండ్లు సమర్పించి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నీలాపు బాలకృష్ణారెడ్డి, కె. సురేష్‌రెడ్డి, రావాడ గోవిందరెడ్డి, బాలానందరెడ్డి, నీలాపు మహేశ్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, వెంకటరెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



విద్యార్థినికి పరీక్ష సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద గుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. అంతకుముందు పది పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ పది పరీక్షల్లో ప్రతీ విద్యార్థి రాణించి, మంచి ఫలితాలు సాధించడమే కాకుండా మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పరీక్షలు రాసే విద్యార్థులందరూ ఎక్కువగా నీరు తాగడంతోపాటు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో రోడ్డు పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

మునగపాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళిత కాలనీ నుంచి వాడ్రాపల్లి, పాటిపల్లి మీదుగా మునగపాక జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఆ ప్రాంత రైతులంతా చందాలు వేసుకొని రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, సర్పంచ్ దిమ్మల అప్పారావు, కోనపల్లి రామ్మోహన్‌రావు, పిల్లి అప్పారావు, బీలా లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.

'ఫార్మర్ రిజిస్ట్రీ వంద శాతం పూర్తిచేయాలి'



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ ఉమాప్రసాద్

పాయకరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలు రానున్న రోజుల్లో వంద శాతం రైతులకు అందజేయాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేయాలని ఏడీఏ ఉమాప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఐదు మండలాల ఏఓలు, ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రీ వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని వంద శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎంపికచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

పూడిమడకలో పారిశుధ్యానికి ప్రాధాన్యం

- సర్పంచ్ చేపల సుహాసిని

అచ్యుతాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార గ్రామమైన పూడిమడకలో పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తున్నామని సర్పంచ్ చేపల సుహాసిని అన్నారు. పూడిమడకలో పేరుకుపోయిన చెత్తను విశాఖలో గల ఉప్పాడ డంపింగ్ యార్డుకు తరలించే కార్యక్రమాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ వాహనాల ద్వారా చెత్తను లోవపాలెం రోడ్డులో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. నాలుగేళ్లుగా తరలించకపోవడంతో చెత్త గుట్టల్లా ఏర్పడిందన్నారు. డీపీఓ ఆదేశాల మేరకు సోమవారం నుంచి వాహనాల ద్వారా చెత్తను విశాఖపట్నం తరలిస్తున్నామని ఆమె తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

▸ త్వరలో చైతన్య యాత్రలు ▸ షుగర్ ఫ్యాక్టరీల ఆధునీకరణ హామీలు ఏమయ్యాయి? ▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం సామాజిక విప్లవ నాయకురాలు సావిత్రిబాయిఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేట్ దిగ్గజాలు అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెట్టడమే ప్రభుత్వాల ధ్యేయంగా కనిపిస్తుందని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నందున ఉద్యమించేందుకు ప్రజా చైతన్యయాత్రలను నిర్వహిస్తున్నామన్నారు. మూడు నెలలుగా గోవాడ షుగర్స్ కార్మికులు, రైతులకు బకాయిలు చెల్లించలేదన్నారు. ఎంపీ సీఎం రమేష్ ఎన్నికల ముందు షుగర్స్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి తెరిపిస్తామని, రూ.వంద కోట్లు కేంద్రం నుంచి మంజూరు చేయిస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. విశాఖ డెయిరీ కంపెనీ చట్టం కింద మార్చి రైతులకు చెల్లించాల్సిన వాటాలను చెల్లించలేదన్నారు. గోవాడ షుగర్స్‌ను ఆధునీకరించి రైతుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో ఏర్పడ్డ సహకార రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.


తాడి గ్రామస్థులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

'తాడి గ్రామాన్ని తరలించకుంటే ఉద్యమం'

పరవాడ : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి తాడి గ్రామంలో పర్యటించారు. కాలుష్యం కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయనకు పలువురు వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను పరామర్శించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. కాలుష్యం కారణంగా కిడ్నీ, గుండె, చర్మ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టడం లేదని వాపోయారు. గ్రామం తరలింపునకు ఈనెల 24న ఆందోళన చేస్తామని ప్రకటించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, గండి నాయనబాబు, వి.వి.రమణ, కె.అప్పలరాజు, జి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

▸ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్ రెడ్డి

పరవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎన్.శివశంకర్‌రెడ్డి అన్నారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలను ఫార్మాసిటీలో గల సీఈటీపీలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విధులను నిర్వర్తించాలన్నారు. యాజమాన్యాలు కూడా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీ నారాయణరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణ, విశాఖ ఫార్మా సిటీ మేనేజింగ్ డైరెక్టర్ పీపీ లాల్‌కృష్ణ, పలు ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఫార్మాసిటీలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. సీఐటీయూ నాయకులు పి.చిన్నారావు, కేదార్‌బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లి గ్రోయిన్ మరమ్మతులకు వినతి


ఏవోకు వినతిని అందిస్తున్న గ్రామాభివృద్ధి పోరాట కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపేట గ్రామం వద్ద శారదా నదికి ఆనుకొని ఉన్న నాగులాపల్లి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామాభివృద్ధి పోరాట కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో నదిలో ఉన్న నీరు వృథాగా సముద్రం పాలవుతుందన్నారు. గ్రోయిన్ దుస్థితిపై పలుమార్లు అధికారులకు వివరించి, వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టినా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. ఈ గ్రోయిన్‌పై అనకాపల్లి పట్టణంతో పాటు పది గ్రామాల ప్రజలు, రైతులు ఆధారపడి ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, సంబంధిత అధికారులు స్పందించి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వాయిబోయిన శేఖర్, చిన్ని సత్తిబాబు, మారేడుపూడి సత్యనారాయణ, వైసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

'సైన్స్‌లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు'


సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అతిథులు

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి భీమునిగుమ్మంలో గల అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సైన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భోగలింగేశ్వర ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్‌లో రాణించే విద్యార్థులకు భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. నోబుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శరగడం నూకరాజు, ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి, రిటైర్డు హెచ్‌ఎం ఆళ్ల ఓంరాం తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో ఉత్సాహంగా కోలాటం పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఆహ్వానపు కోలాటం పోటీలు ఉత్సాహంగా సాగాయి. తొలుత పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు పోటీలను ప్రారంభించారు. పదహారు గ్రామాల నుంచి కోలాటం జట్లు పాల్గొన్నాయి. ఆద్యంతం ఉల్లాసంగా... ఉత్సాహంగా పోటీలు జరిగాయి. మంత్రిపాలెం, లక్కవరం, గొల్లలపాలెం, వెంకటపతిపాలెం, జాజులవానిపాలేనికి చెందిన కోలాటం బృందాలు వరుసగా ఒకటి నుంచి ఐదు స్థానాల్లో నిలిచాయి. వీరికి నగదుతో పాటు జ్ఞాపికలను సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, పోతల అప్పలనాయుడు, రాజాన సత్యం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలకు రాష్ట్ర నాయకులు మద్దతు


దీక్షలో కూర్చొన్న వారికి సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ యాజమాన్యం అక్రమంగా సస్పెన్షన్ చేసిన కండక్టర్ ఎస్ఎస్ నారాయణ, డ్రైవర్ ఎంఏ రావులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు డిమాండ్ చేశారు. ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట చేపట్టిన ఆందోళన సోమవారం పదో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో బీఏ కుమార్, సీహెచ్ఎస్ఎన్ సత్యవతి, కేతు రావు, నాయుడు కూర్చొన్నారు. వీరికి ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి వీవీవీ మోహన్ సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుని ఊరేగింపుపై దాడి అన్యాయం

▸ విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆందోళన
▸ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పణ

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రుని ఊరేగింపులో మసీదుకు చెందిన కొంతమంది ముస్లిం యువకులు రాళ్లతో దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఇక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆందోళనకారులు ప్రదర్శన జరిపి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీడీ నాయుడు మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించకపోగా, తిరిగి హిందువులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కొణతాల అప్పలరాజు మాట్లాడుతూ రాయచోటి సంఘటనలో అక్కడి ఎస్ఐ అల్లరిమూకలకు మద్దతు పలకడం బాధాకరమన్నారు. గతంలో కూడా మసీదుకు చెందిన కొంతమంది వ్యక్తులు అయ్యప్ప మాల ధరించిన వారిపై దౌర్జన్యం చేశారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు శ్రీకాళహస్తి, నాగబాబు, ప్రదీప్, కాండ్రేగుల నారాయణరావు, ఆడారి రాజు, వుడా రమేష్, భక్త సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

అజయ్‌నగర్, మర్రిపాలెం గ్రామాలను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

▸ సమావేశంలో ఇరు గ్రామాల ప్రజలు తీర్మానం


సమావేశమైన ఇరు గ్రామాల పెద్దలు

సబ్బవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాటజంగాలపాలెం శివారు అజయ్‌నగర్, అనకాపల్లి మండలం కోడూరు శివారు మర్రిపాలెం గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని మంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరుతూ ఇరు గ్రామాల పెద్దలు సోమవారం తీర్మానం చేశారు. అజయ్‌నగర్ ఏర్పాటైన సమావేశంలు ఇరు గ్రామాల పెద్దలు మాట్లాడుతూ రెండు శివారు గ్రామాలు ఒకేచోట ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రెండు గ్రామాల్లో సుమారు 1200 మంది ప్రజలు, సుమారు 750 మంది ఓటర్లు ఉన్నందున రెండు గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని మంత్రికి రాసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లో అమరావతిలో మంత్రిని నేరుగా కలిసి సమస్యను విన్నవించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల పెద్దలు వనం నాయుడుబాబు, సత్యనారాయణ, పోతల శ్రీనివాసరావు, వి.సోమినాయుడు, శివ, దొగ్గ సన్యాసినాయుడు, జగదీష్, రమణ, కర్రి రఘు, సత్యనారాయణ, గొర్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అచ్చెర్ల ప్రధాన రోడ్డు

▸ దారి పొడవునా గోతులమయం
▸ గత ఐదేళ్లూ పట్టించుకోని పాలకులు
▸ తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


అచ్చెర్ల ప్రధాన రోడ్డుపైకి చేరిన వాడుకనీరు


రోడ్డుపై రాళ్లు తేలి ఉన్న దృశ్యం

కశింకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివారు గ్రామం అచ్చెర్లకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. సింగవరం, పాత అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్డు వంక కన్నెత్తి చూసేవారు లేకపోవడంతో నేడు ఈ దుస్థితికి చేరుకుందని పలువురు వాపోతున్నారు. గోతులు పడిన ఈ రహదారిలో ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. కూలి పనుల నిమిత్తం తాళ్లపాలెం, అనకాపల్లికి ద్విచక్ర వాహనాలు, ఆటో లపై చాలా మంది వెళ్లి వస్తుంటారు. వీరు ఆయా వాహనాల్లో ప్రయాణం చేసేటప్పుడు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇదిలావుంటే, వర్షం కురిసినప్పుడు అచ్చెర్ల గ్రామస్థులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతుందని చెపుతున్నారు. కొన్నిచోట్ల నివాస గృహాల్లో వాడుకనీరు రోడ్డుపై విడిచిపెడుతుండడం వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని అంటున్నారు. దీని వల్ల ఆ నీరు మురుగుగా మారి, దోమలు విజృంభిస్తున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అచ్చెర్ల ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడంతో పాటు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని అంతా కోరుతున్నారు.

పట్టణంలో
జోనల్ కమిషనర్ విస్తృత పర్యటన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ సోమవారం విస్తృతంగా పర్యటించారు. రింగు రోడ్డు, మెయిన్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, నూకాంబిక ఆలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్మికులు పారిశుధ్య పనులను ఏ విధంగా చేస్తున్నారో పరిశీలించారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎక్కడా చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్‌లను ఆయన పరిశీలించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

తుమ్మపాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ- ఉపాధి కల్పన మిషన్‌లో భాగంగా దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువకులకు మల్టీ స్కిల్ టెక్నీషియన్, లాజిస్టిక్ కంప్యూటర్, ఇంగ్లీష్ ట్రేడ్స్‌లలో ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రమేష్‌బాబు సోమవారం తెలిపారు. పదో తరగతి, ఆపై ఉత్తీర్ణత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల లోపు గల యువతీ యువకులు అర్హులుగా పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 89785 33105 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

కశింకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం నుంచి మండలంలోని ప్రతి గ్రామంలో సభలు ఏర్పాటు చేసి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఇక్కడి మండల పరిషత్ సమావేశ మందిరంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎం. నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని మొత్తం ఉపాధి హామీ పనులపై వేతనాల రూపంలో రూ.13 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.3.63 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. పది రోజుల పాటు జరగనున్న ఈ సోషల్ ఆడిట్‌లో వివరాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాస్, ఏపీవోలు శ్రీనివాసరావు, శివసత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'విజేత సంస్థ డిపాజిటర్ల వివరాలు సంఘానికి తెలియజేయాలి'

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విజేత సంస్థ డిపాజిటర్లు తమ వివరాలను విజేత డిపాజిటర్ల సంక్షేమ సంఘానికి తెలియజేయాలని సంఘం కార్యదర్శి సత్యనారాయణ కోరారు. సోమవారం ఇక్కడ జరిగిన డిపాజిటర్ల సంఘ సమావేశంలో మాట్లాడారు. త్వరలో కోర్టు ద్వారా డిపాజిట్లు తిరిగి చెల్లింపునకు కోర్టు లిక్విడేటర్‌ను నియమించిందన్నారు. 2002 నుంచి డిపాజిట్‌దారులకు మెచ్యూరిటీ ఇవ్వకుండా సంస్థ మోసం చేసిందని ఆరోపించారు. డిపాజిట్‌దారులు బాండ్లు, రశీదులు, పాసు పుస్తకాల జెరాక్స్‌లు తీసి రూ.20 స్టాంప్ పేపరు మీద నోటరీ చేయించి పది రోజుల్లోగా అనకాపల్లిలోని విజేత డిపాజిటర్ల సంక్షేమ సంఘం కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'పాడి రైతులు సంఘటితంగా ముందుకు సాగాలి'

కశింకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు సంఘటితంగా ఏర్పడి ఆర్థికాభివృద్ధి చెందాలని మండల పశు వైద్యాధికారిణి ఆల్ఫోన్స జాన్స్ అన్నారు. ఇక్కడి పశుసంవర్ధక శాఖ ఆసుపత్రిలో అభ్యుదయ పాడి రైతులతో ఎస్.చిట్టమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు నాణ్యమైన దాణా, మందులు కొనుగోలు చేయాలన్నారు. పాడి సంపద సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాడి పశువులకు అనారోగ్యం సోకితే వెంటనే సమీపంలోని పశువుల ఆస్పత్రులను సంప్రదించాల్సిందిగా సూచించారు. సంఘంలోని రైతులు స్వయంగా ఉత్పత్తి చేసిన పశుగ్రాసాలను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సంఘం ప్రతినిధులు అప్పలనాయుడు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా.. ఘనంగా అమ్మవార్ల వేడుకలు


ప్రత్యేక అలంకరణలో బయ్యవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారు

కశింకోట : బయ్యవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్స వం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తుల దర్శించుకున్నారు. మధ్యా హ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ కలగా లక్ష్మి, వైసీపీ నాయకులు మళ్ల బుల్లిబాబు, దంతులూరి దిలీప్‌కుమార్, కలగా గున్నయ్యనాయుడు, గొంతిన శివ, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిశోర్ తదితరులు పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, నానాజీ, నార్ని శ్రీనివాసరావు, జి.గణేష్, కొల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపేటలో గంగాభవానీ జాతర

లంకెలపాలెం : జీవీఎంసీ 79వ వార్డు గొల్లపేటలో సోమవారం గంగాభవానీ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి జలాభిషేకం జరిపారు. సాయంత్రం ఘటాలను ఆలయం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదిలావుంటే, జీవీఎంసీ 85వ వార్డు పరిధి మంత్రిపాలెంలో జువ్వాలమ్మ పండుగను మంగళవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు పరవాడలో పైడిమాంబ అమ్మవారి అనుపోత్సవం

పరవాడ : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పరవాడ పైడిమాంబ అమ్మవారి అనుపోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లా నుంచి భక్తులు భారీగా తరలి వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా చలువ పందిళ్లు, క్యూలైన్లు సిద్ధం చేశారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే, తానాం గ్రామంలో పరదేశిమాంబ అమ్మవారి అనుపోత్సవం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ~~టు చేశారు.


పరవాడలో కొలువుదీరిన పైడిమాంబ

దేమునిగుమ్మం
వెంకన్న ఆలయంలో కల్యాణోత్సవానికి శ్రీకారం


ధ్వజారోహణ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి, గరుడ ఆళ్వార్లకు ఆగమశాస్త్ర ప్రకారంగా పూజలు చేశారు. సాయంత్రం దేవాలయం నుంచి ప్రత్యేక రథంపై శ్రీవారు ఆసీనులు కాగా మంగళ వాయిద్యాలతో మల్లవరపువారి వీధిలోని కన్యాదాత ఇంటికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ అలివేలుమంగతో వివాహానికి అంగీకరించి ఊరేగింపుగా బయలుదేరి రాత్రి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో టి.రాజసులోచన, ధర్మకర్తలు గోలి మురళీ, సీహెచ్.నూకరాజు, వేదుల సూర్యప్రభ, సోమాదుల తులసీ, కొణతాల అరుణ, ఆలయ అర్చకులు పులఖండం ప్రసాద్‌బాబు, పులఖండం రాజేష్‌లతో పాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దిబ్బపాలెం గ్రామంలో కల్యాణం

తుమ్మపాల : దిబ్బపాలెంలో గల వెంకన్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ వేడుకకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై వీక్షించి తరించారు. గ్రామ నాయకులు పీలా శంకర్, మళ్ల వెంకటరమణ, మళ్ల అమ్మోజమ్మ, పెంటకోట గోవింద్, మళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీలేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను అర్చకులు రామశర్మ నిర్వహించారు. కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

కలెక్టర్‌ను కలిసిన కాకినాడ జడ్పీ సీఈవో



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న కాకినాడ జడ్పీ సీఈవో లక్ష్మణరావు

పాడేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌ను కాకినాడ జడ్పీ సీఈవో లక్ష్మణరావు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలు ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ పరిధిలో ఉండడంతో ఆయా ప్రాంతాల్లోని పంచాయతీరాజ్ శాఖ కార్యకలాపాలపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు. ఆయా మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు.

పాతపాడేరులో సిల్వర్‌ఓక్ తోటలు దగ్ధం



పాతపాడేరు కొండల్లోని తోటల్లో ఎగసిపడుతున్న మంటలు

పాడేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత పాడేరు గ్రామానికి సమీపంలోని సిల్వర్‌ఓక్ తోటలు సోమవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి ఆనుకుని ఉన్న కొండపై గిడ్డి కర్రిబాబునాయుడుకు చెందిన రెండెకరాల సిల్వర్‌ఓక్ తోట అగ్నికి ఆహుతైపోయింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఈతోటలకు నిప్పు పెట్టడం వల్లే దగ్ధమయ్యాయని స్థానికులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కర్రిబాబునాయుడు కోరుతున్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

పాడేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతి మహిళానేత, సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే 193వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక టీడీపీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె త్యాగాలు, జాతికి అందించిన సేవలను టీడీపీ సీనియర్ నేత పాండురంగస్వామి కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సాగర సుబ్బారావు, పి.రామలింగం, ఆర్.త్రినాథ్, జి.మురళీ, ఎ.తిరుపతిరావు, అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

ముంచంగిపుట్టు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే 193వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలో జర్రెల పంచాయతీ సెల్లూరంపుట్టు గ్రామంలోని పాఠశాలలో సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు మొస్య ధర్మారావు, ఉపాధ్యాయుడు ఆర్.కామేశ్, విద్యార్థులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి పూలే చేసిన సేవలు, మహిళాభివృద్ధికి గావించిన కృషిని హెచ్‌ఎం వివరించారు.

ఫీడర్ అంబులెన్సులో ప్రసవం

▸▸ తల్లీబిడ్డ క్షేమం



బాలింతకు శిశువును అందిస్తున్న ఈఎంటీ హరి

కొయ్యూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) ఫీడర్ అంబులెన్సులో పీహెచ్‌సీకు తరలిస్తుండగా గిరిజన మహిళ మార్గమధ్యంలో ప్రసవమైంది. అంబులెన్సు ఈఎంటీ చాకచక్యంగా వ్యవహరించి పురుడు పోసిన ఘటన మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. బూదరాళ్ల పంచాయతీ లోయలపాలెంకు చెందిన గర్భిణి దిప్పల నిర్మల ప్రసవ వేదనకు లోనైంది. దీంతో గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త రాజేంద్రపాలెం పీహెచ్‌సీకు తరలించేందుకు ఫీడర్ అంబులెన్సుకు సమాచారం ఇచ్చింది. దీంతో గర్భిణిని ఫీడర్ అంబులెన్స్‌లో పీహెచ్‌సీకి తరలిస్తుండగా ప్రసవ వేదన తీవ్రమైంది. దీంతో చేసేది లేక ఈఎంటీ హరి చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం జరిపాడు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నప్పటికీ, తదుపరి వైద్య సేవల నిమిత్తం అదే అంబులెన్సులో తల్లిబిడ్డను ఆర్‌జే పాలెం పీహెచ్‌సీకు ఈఎంటీ తరలించారు. మారుమూల గ్రామాలలో అత్యవసర సమయాల్లో ఫీడర్ అంబులెన్సు సేవలు అందుబాటులోకి రావడంతో ప్రాణాలు నిలుస్తున్నాయని, వీటిని మరింత పటిష్టపరిచేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరారు. కాగా, ఫీడర్ అంబులెన్సు ఈఎంటీ సకాలంలో స్పందించటంపై నిర్మల కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీల ఉద్యమంపై నిర్బంధం తగదు

▸▸ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

▸▸ ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



ఐసీడీఎస్ పీడీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన అంగన్‌వాడీలు

పాడేరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీల ఉద్యమంపై నిర్బంధం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం పాడేరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడను పోలీసులు భగ్నం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం వలే కూటమి ప్రభుత్వం కూడా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులను ఐసీడీఎస్ పీడీ బెదిరింపులకు పాల్పడడం అన్యాయమన్నారు. అంగన్‌వాడీలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిపై పీడీ ఏ రోజూ దృష్టి సారించలేదన్నారు. పీడీ సూర్యలక్ష్మి వైఖరిపై శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు కొండమ్మ, డుంబ్రిగూడ ప్రాజెక్టు అధ్యక్షురాలు కొండమ్మ, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

▸▸ చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

▸▸ మెగా కంటి వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు



వైద్యులతో మాట్లాడుతున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

గూడెంకొత్తవీధి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు పోలీసు శాఖ ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. సోమవారం జీకేవీధి పోలీసు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 250 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు. ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు, జీకేవీధి వైద్యులు అచ్యుత్, వినయ్ రోగులకు సాధారణ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన 43 మందిని విశాఖపట్నం తరలించడం జరుగుతుందని ఏఎస్పీ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. రోగులకు భోజన, వసతి ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

గుడ్/బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

▸▸ అరకులోయ సీఐ ఎల్.హిమగిరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

అరకులోయ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ బాలికకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి తెలిపారు. అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం బాలికలతో ప్రత్యేకంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్ టచ్ అంటే ఏమిటి, బ్యాడ్‌టచ్ అంటే ఏమిటి అనే విషయాలను సీఐ హిమగిరితో పాటు ట్రైనీ మహిళా ఎస్ఐలు శకుంతల, భవ్య బాలికలకు వివరించారు. అంతే కాకుండా పిల్లలందరూ మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని , ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా వ్యవహరించాలని, విద్యార్థులంతా చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిగి చేరుకోవాలని సీఐ కోరారు. త్వరలో పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హైస్కూల్ మైదానాన్ని పరిశీలించిన సీఐ, తనవంతుగా హైస్కూల్‌లో స్టేజి అభివృద్ధికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం సీఐ హిమగిరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకులు



సీనియర్ నేత శివశంకర్ సమక్షంలో జనసేన కండువాలు కప్పుకున్న నేతలు

అరకులోయ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అరకు అసంబ్లీ నియోజకవర్గం నుంచి పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన రెబల్ అభ్యర్థి సమర్డి రఘునాథ్ తదితరులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం విశాఖపట్నంలో ఉన్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ సమక్షంలో జనసేన పార్టీ కండువాలు వేసుకున్నారు. వీరందర్నీ అల్లూరి జిల్లా జనసేన కార్యదర్శులు రాందాసు, లక్ష్మణరావ తదితరులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వద్దకు తీసుకువెళ్లి పార్టీలో చేర్పించారు. రఘునాథ్‌తో పాటు పెదలబుడు మాజీ వైస్ సర్పంచ్ సత్యానందం, మాజీ వార్డు సభ్యుడు బేకరి శ్రీను పలువురు నేతలు పార్టీలో చేరారు. అదే విధంగా హుకుంపేట మండలానికి చెందిన వైసీపీ నాయకుడు నయిని సత్తిబాబు, పెదబయలు మండలం పోయిపల్లి సర్పంచ్ బద్రీనాథ్ తదితరులు కూడా జనసేన పార్టీలో చేరారు.

రాయచోటిలో హిందువులపై దాడికి నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

పాడేరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వీరభద్ర స్వామి వారి ఉత్సవంలో హిందువులపై దాడిని, అక్రమ కేసులను వ్యతిరేకిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కూడా రామకృష్ణ పరమహంస అన్నారు. ఘటనపై రాష్ట్ర వీహెచ్‌పీ పిలుపు మేరకు సోమవారం స్థానిక కనక దుర్గమ్మ ఆలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడే నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పరమహంస మాట్లాడుతూ దాడికి పాల్పడిన ముస్లింలపై చర్యలు చేపట్టాలని, అక్రమంగా కేసులు నమోదుచేసిన రాయిచోటి ఎస్ఐను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు మఠం శాంతకుమారి, మినుముల గోపాలపాత్రుడు, సల్లా రామకృష్ణ, కుడుముల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆందోళన



సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగిలిసింగి పంచాయతీ వాకపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సచివాలయం కేంద్రం ఎదుట సోమవారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అనంతరం సీపీఎం మండల నాయకుడు పి.డోంబు మాట్లాడుతూ వాకపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యం కోసం గత ఏడాది జల్ జీవన్ పథకం ద్వారా గ్రావిటీ పథకం మంజూరైనప్పటికీ, నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో ఈ దుస్థితి దాపురించిందని చెప్పారు. దీంతో ఆ గ్రామస్థులు సమీపంలోని పొలంలోని నీటిని సేకరించి పలు ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీటిని ఉపయోగించడంతో గ్రామస్థులు మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో గ్రావిటీ పథకం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాందాస్, పోద్దు, జిన్ను, కృష్ణరావు పాల్గొన్నారు.

పందిదుర్లు రోడ్డుపై అటవీ ఆంక్షలు తొలగించాలి

▸▸ సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స



పందిదుర్లులో ప్రజా సంకల్పయాత్ర చేపట్టిన సీపీఎం నాయకులు

పాడేరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిదుర్లు గ్రామ రహదారి నిర్మాణంపై అటవీ శాఖ ఆంక్షలను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మోదాపల్లి, వంట్లమామిడి పంచాయతీ పందిదుర్లు, ఓనూరు గ్రామాల్లో సీపీఎం నేతలు ప్రజా సంకల్ప యాత్రను చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ పందిదుర్లు గ్రామానికి అమ్మవారి పాదాలు నుంచి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ అటవీ శాఖ ఆంక్షలు నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. అంత్యోదయ కార్డుల సమస్యలపై ఈనెల 12వ తేదీన చలో వంట్లమామిడి సచివాలయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అక్కడ సమస్యలకు పరిష్కారం లభించకుంటే చలో తహసీల్దార్ కార్యాలయం చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలికి లక్కు, వంతాల దాసు, ఎల్.సుందరరావు, నాగేశ్వరరావు, చిన్నారావు, చిన్నయ్య, బాబూరావు, విజయ, కమల పాల్గొన్నారు.

‘విద్యుత్ భారాన్ని మోపితే సహించేదిలేదు’

చింతపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపితే సహించేదిలేదని సీపీఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు, గిరిజనులు విద్యుత్ బిల్లులను దహనం చేసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల పేరిట ఏపీ ప్రభుత్వం 8వేల కోట్లకుపైగా భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధపడిందన్నారు. సామాన్యులపై విద్యుత్ భారాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీలు పెంచితే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాగిన చిరంజీవి పడాల్, మజ్జి నాగేంద్ర, రాంబాబు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడిలేకుండా చర్యలు

గూడెంకొత్తవీధి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పరిధిలో చేతిపంపులు, రక్షిత నీటి పథకాల తాజా పరిస్థితిని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్, ఈవోపీఆర్‌డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షకు 97 శాతం హాజరు

పాడేరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం మేథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో ఎల్.అప్పలరామ్ తెలిపారు. జిల్లాలోని 26 పరీక్ష కేంద్రాలకు 4,315 మంది హాజరు కావాల్సి ఉండగా 4,200 (97.33 శాతం) మంది హాజరయ్యారని, 115 మంది గైర్హాజరయ్యారన్నారు. అదేవిధంగా జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన ఒకేషనల్ గ్రూపు పరీక్షలకు 1,217 మంది హాజరు కావాల్సి ఉండగా.. 1,136 (93.34 శాతం) మంది హాజరయ్యారని, 81 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో జనరల్ గ్రూపు విద్యార్థులు 144 మంది హాజరు కావాల్సి ఉండగా 140(97.22 శాతం)మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 397 మంది హాజరు కావాల్సి ఉండగా 338 (96.47 శాతం)మంది హాజరుకాగా.. 14 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమాదేవి తెలిపారు.

ఏఎస్ఆర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న దృశ్యం

కొయ్యూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బాలారం బంగారుతల్లి జాతరను పురస్కరించి మాజీ సర్పంచ్ దివంగత అప్పన శ్రీరాములు పేరున నిర్వహించిన లీగ్ క్రికెట్ టోర్నీని ఎస్ఐ కిశోర్‌వర్మ సోమవారం ప్రారంభించారు. టోర్నీలో 30 జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో భాగంగా కృష్ణాదేవిపేట-చోద్యం, అంకంపాలెం-వణకరాయి, కిష్టారం-ఎం.మాకవరం, ఆడాకులు-బాలారం జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించారు. వీటిలో కృష్ణాదేవిపేట, వణకరాయి, ఎం.మాకవరం జట్లు విజేతలుగా నిలిచాయి. టోర్నీ నిర్వాహకులు అప్పన ఆనంద్‌కుమార్, లక్ష్మీరాజ్ క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించారు.

‘గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలి’

చింతపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు విధిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని సీహెచ్‌సీ స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ అనీష అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 250మంది గర్భిణులకు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేశారు. ఈసందర్భంగా అనీష మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు. గర్భిణులు ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులకు వసతిగృహంలో పూర్తిస్థాయి సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులోను ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ సమావేశాలు విజయవంతం చేయండి



ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర

పాడేరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆదివాసీ జేఏసీ నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి సమావేశాలు విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ రామారావు దొర సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆదివారం చింతూరులో జరిగిన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో పోలవరం పోలవరం నిర్వాసితులతో చర్చించిందన్నారు. చింతపల్లి, రంపచోడవరం, కేఆర్.పురం, పార్వతీపురం మన్యం జిల్లాలలో త్వరలోనే డివిజన్ స్థాయి సమావేశాలు జరగనున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినప్పటికి నేటికీ ట్రైబల్ అడ్వయిజర్ కమిటీ(టీఏసీ) ఏర్పాటు చేయలేదన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

వినియోగదారుల హక్కులపై చైతన్యవంతులు కావాలి : ఎస్ఐ



ఎస్సై వెంకట రమణను సన్మానిస్తున్న దృశ్యం

చింతపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై విద్యార్థులు చైతన్యవంతులు కావాలని స్థానిక ఎస్ఐ వెంకట రమణ అన్నారు. సోమవారం స్థానిక గురుకులం జూనియర్ కళాశాలలో నిర్వహించిన వినియోగదారుల వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ 1986 చట్టం ద్వారా వినియోగదారుడు నాణ్యత, ఎంఆర్‌పీ పరిశీలించి వస్తువులను కొనుగోలు చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐని ఉపాధ్యాయులు, వినియోగదారుల హక్కుల సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ బూడిద చిట్టిబాబు, ప్రిన్సిపాల్ రామేశ్వరం పాల్గొన్నారు.

యువత పోరుకు సిద్ధం కావాలి

▸▸ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, నాయకులు

అనంతగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యువత పోరుకు సిద్ధం కావాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. సోమవారం అనంతగిరి హరిత రిసార్ట్స్ వద్ద వైసీపీ మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత భవిష్యత్తు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే యువత పోరు కార్యక్రమంలో భాగంగా పాడేరు జిల్లా కేంద్రంలో చేపట్టే ధర్నాకు యువత భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే అదే రోజు వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అరకు నియోజకవర్గంలోని వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో జెండాను ఎగరవేసి పార్టీకి ఉన్న బలాన్ని తెలియజేయాలని కార్యకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ సెల్ అధ్యక్షులు స్వామి, కవిత, సీనియర్ నాయకులు గంగన్నదొర, దానియేలు, నవీన్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌రే యూనిట్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద

ఏరియా ఆస్పత్రిలో ఎక్స్‌రే యూనిట్ ఆధునికీకరణ

నర్సీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రిలోని ఎక్స్‌రే విభాగాన్ని ఆధునికీకరించారు. పాత ఎక్స్‌రే మిషన్ పాడవ్వడంతో అడ్వాన్స్ టెక్నాలజీ గల ఎక్స్ రే మిషన్‌ను ఏపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాంతీయ ఆస్పత్రిలో ఎముకలు, గుండె, ఊపిరి తిత్తులు సమస్యలతో బాధపడుతున్న రోగులకు డాక్టర్ సిఫారసు మేరకు రోజుకు 50 నుంచి 70 ఎక్స్‌రేలు తీస్తుంటారు. ఓపీ అధికంగా ఉంటే వంద ఎక్స్‌రేలు తీస్తారు. ఇక్కడ ఉన్న 30 ఏళ్ల నాటి ఎక్స్ రే మిషన్ పాడవ్వడంతో మరమ్మతులు చేయించడానికి కూడా పనికి రాకుండా పోయింది. పాత మిషన్ మూలకు చేరడంతో మూడేళ్ల క్రితం సీఆర్ (కంప్యూటెడ్ రేడియోగ్రఫీ), డీఆర్ (డిజిటల్ రేడియోగ్రఫీ) మొబైల్ ఎక్స్‌రే మిషన్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు సీఆర్, డీఆర్ మొబైల్ మిషన్లు ఉపయోగించే ఎక్స్‌రేలు తీస్తున్నారు. తాజాగా రూ.7.35 లక్షల విలువైన అడ్వాన్స్ టెక్నాలజీ గల ఎక్స్ రే మిషన్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మిషన్‌తో పాటు ఏసీ అమర్చారు. గతంలో ఉన్న గది చెక్క తలుపులు తీసేసి రేడియేషన్ నుంచి రక్షణ కల్పించే మెటల్ డోర్లు బిగించారు. ఎక్స్‌రే విభాగంలో ఇప్పటికే ఉన్న మొబైల్ ఎక్స్‌రే మిషన్లతో పాటు లేటెస్ట్ ఎక్స్‌రే మిషన్ రోగులకు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

- సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల లైంగిక వేధింపుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ సూచించారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం 2012లో పోక్సో చట్టం అమలులోకి తెచ్చారని తెలిపారు. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు లైంగిక విద్యను కూడా బోధించాలని సూచించారు. లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పించడానికి వీడియో సందేశాన్ని ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ గోవిందరావు, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం తగదు



గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నర్సీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హామీల అమలు కోసం పోరాడుతున్న అంగన్‌వాడీలను నిర్బంధించడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అన్నారు. సోమవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నర్సీపట్నం, గొలుగొండ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని, అక్కడ గేటు ఎదుట నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ వెళుతున్న కార్యకర్తలను నిర్బంధించడం దారుణమన్నారు. ప్రధానంగా వేతన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వి.సామ్రాజ్యం, పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిరండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్, నాయకులు

నర్సీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై అనకాపల్లిలో నిర్వహిస్తున్న యువత పోరు నిరసన కార్యక్రమానికి తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ పిలుపు నిచ్చారు. సోమవారం పెదబొడ్డేపల్లిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మాడుగుల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో శంకరం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ శంకరం పంచాయతీ పరిధిలోని గొప్పూరు, తాడివలస గిరిజన గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో మహిళలు నానా అవస్థలు పడుతూ ఊట నీరు తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారని వాపోయారు. ఇంటింటికీ కొళాయిలు ఉన్నప్పటికీ, వాటి నుంచి నీరు రాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించాలని, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

షుగర్ ఫ్యాక్టరీ సమస్యలకు సర్కారు వైఫల్యమే కారణం

- రైతులకు న్యాయం చేయకుంటే నిరాహార దీక్ష చేస్తాం
- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొత్స, చిత్రంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి అమర్‌నాథ్

చోడవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ప్రస్తుత పరిస్థితులకు ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం వైఫల్యమే కారణమని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. సోమవారం సాయంత్రం ఆయన వైసీపీ నేతలు, మాజీ మంత్రులతో కలిసి గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి యార్డులో చెరకు రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సహకార రంగంలో మిగిలిన ఏకైక గోవాడ షుగర్ ఫ్యాక్టరీని నడిపించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి రైతుల సమస్యలపట్ల చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుందన్నారు. అధికారంలో ఉన్న కూటమి నాయకులు గొప్పలు చెప్పుకోవడం మినహా, రైతుల కోసం చేస్తున్నది ఏమీ లేకపోవడం స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. చెరకు రైతులు ఇన్ని కష్టాలు పడుతున్నా ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను ఏమీ అనలేమని, అతడు ఈ ప్రాంతం వాడుకాడు కాబట్టి అతడి గురించి మాట్లాడలేమని అతడిని ఎన్నుకోవడం ఈ ప్రాంత ప్రజల తప్పని అన్నారు. చెరకు రైతుల కష్టాలను చూస్తూ ఊరుకునేది లేదని,, కచ్చితంగా శాసనమండలిలో రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే రైతులు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఫ్యాక్టరీకి తెస్తున్న చెరకును క్రషింగ్ చేసి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైసీపీ చోడవరం, మాడుగుల నియోజకవర్గ నాయకులు ఏడువాక సత్యారావు, బూరె బాబూరావు, వైసీపీ యువజన అధ్యక్షుడు పుల్లేటి వెంకటేశ్, పల్లా నరసింగరావు, నెహ్రూ, లింగబాబు, డీవీఆర్, కోన చంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవాలు

- భక్తులతో కిక్కిరిసిపోయిన గిరిజాంబగిరి



భక్తులతో కిక్కిరిసిపోయిన గిరిజాంబగిరి

బుచ్చెయ్యపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 152వ వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వడ్డాది గిరిజాంబగిరి కిటకిటలాడింది. వేకువజామున మూడు గంటలకు ఆలయ ధర్మకర్తలు దొండా కన్నబాబు, శ్రీరామ్ తొలి పూజలు చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనాలు ప్రారంభించారు. గిరిజాంబ గిరిపై క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. బుచ్చెయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఘనంగా స్వామివారికి దొంగ పెళ్లి

ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, దొండా శ్రీరామ్‌లు ఆదివారం రాత్రి ధ్వజారోహనచేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆనవాయితీ ప్రకారం స్వామివారికి దొంగ పెళ్లి నిర్వహించారు. పుట్టమన్ను తవ్వి ప్రమిదల్లో వేసి నవదాన్యాలు జల్లారు. ఉత్సవాలు ముగింపు నాటికి ఏ విత్తనాలు మొలకెత్తుతాయో ఆ రకం పంటలనే ఈ ప్రాంత రైతులు సాగు చేస్తుంటారు. ఇది ఇక్కడ భక్తుల నమ్మకం. శనివారం వరకూ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటుచేశారు. శుక్రవారం వరకూ ఐదు రోజులు పాటు వేంకటేశ్వరస్వామి అన్నదాన సేవా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం కూడా భోజనం ఏర్పాటు చేస్తున్నారు.

కాగా వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణానికి అవసరమైన పూలు, పట్టు వస్త్రాలు, సామగ్రిని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేశ్ సమకూర్చారు. తన సొంత నిధులు వెచ్చించి అర్చకులకు అందించారు.

విద్యార్థులకు ఎగ్జిక్యూటివ్ ఫైళ్ల పంపిణీ

నర్సీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ బాలురు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు సర్టిఫికెట్లు భద్రపరుచుకునే ఎగ్జిక్యూటివ్ ఫైళ్ల ఫోల్డర్లు పంపిణీ చేశారు. పెదబొడ్డేపల్లిలోని బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి వై.సన్యాసిరావు చేతుల మీదుగా ఒక్కొక్కటి రూ.200 విలువ చేసే ఈ ఫైళ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ.రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మంజు, సంఘ ప్రతినిధులు జామి సాంబశివరావు, కె.అప్పారావు, చంటి, పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు నమూనా పరీక్షలు

చోడవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నమూనా పరీక్షలు నిర్వహించారు. స్థానిక కొత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్షలు దోహదపడతాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాబ్జి తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఎంఈవో సింహాచలం, హెచ్ఎం రామిరెడ్డి బహుమతులు అందించారు.

నేడు సీతయ్యపేటలో పరదేశమ్మ పండగ

బుచ్చెయ్యపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్యపేట గ్రామంలో మంగళవారం పరదేశమ్మ పండగ జరగనున్నది. ఈ పండగకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామం మొత్తం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోలాటం, నేలవేషాలు, డప్పులు, సాముగారడీ, భారీ మందుగుండు సామగ్రితో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కోమళ్లపూడిలో నాటుకోళ్లు మృతి

బుచ్చెయ్యపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమళ్లపూడి గ్రామంలో సోమవారం 20 నాటుకోళ్లు ఆకస్మికంగా మృతిచెందాయి. గ్రామంలోని ఇళ్లవద్ద పెంచుతున్న జాతి పుంజులు, పెట్టలు మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందాయి. ఒక్కొక్క కోడి విలువ రూ.వెయ్యి నుంచి మూడు వేల వరకూ ఉంటుందని బాధితులు గున్నా జగన్నాథం, చిన్నమ్మలు, గండెం వీరబాబు తదితరులు తెలిపారు.

మినుములో దిగుబడి లేక రైతుల దిగాలు

గొలుగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మినుము పంట సాగులో దిగుబడు లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలోని ఈ ఏడాది సుమారు 400 హెక్టార్లలో మినుము పంట సాగు చేపట్టారు. ఆశించినంతగా సాగులో దిగుబడులు రాకపోవడంతో ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయామని రైతులు అంటున్నారు. పాతమల్లంపేట, చీడిగుమ్మల, గొలుగొండ, అమ్మపేట, పాకలపాడు, కొత్తఎల్లవరం, గుండుపాల గ్రామాల్లో మినప సాగు చేపట్టారు. రైతులకు అశించినంతగా అపరాల సాగులో దిగుబడులు రాలేదని రైతులు వాపోతున్నారు. కనీసం విత్తనాలు రాని పరిస్థితులు మండలంలోని చోటు చేసుకున్నాయని రైతులు అంటున్నారు.

వెంకన్న మెట్లకు గోవింద నామాలు

బుచ్చెయ్యపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది వెంకన్న ఆలయం అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దంపతులు సొంత నిధులు వెచ్చించారని, ఈ నిధులతో వెంకటేశ్వరస్వామి ఆలయం మెట్ల మార్గంలో గోవిందనామాలు ఏర్పాటు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు తెలిపారు. 233 మెట్లకు ఇరువైపులా గ్రానైట్ పలకలతో గోవింద నామాలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఈ పనులను ఆలయ కమిటీ ఛైర్మన్ దొండా కన్నబాబు పర్యవేక్షించారు. అలాగే మెట్లను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కావడంతో మెట్ల మార్గంలో కొండపైకి వచ్చే భక్తులను గోవిందనామాలు ఆకట్టుకుంటున్నాయి.

నూతన పోకడలతో పర్యావరణ సుస్థిరత

- హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం



సదస్సులో మాట్లాడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం

చోడవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్రంలో నూతన పోకడల ద్వారా పర్యావరణ సుస్థిరతకు అవకాశం ఉంటుందని హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రమ్మణ్యం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులో మాట్లాడిన ప్రొఫెసర్, ప్రస్తుత కాలంలో తినే ప్రతీ వస్తువు రసాయనాలతో కలుషితమవుతున్నదని, ఈ పరిస్థితుల్లో రసాయనాల్లో నూతన పోకడలు అమలుచేయడం ద్వారా పర్యావరణానికి హాని లేకుండా పరిశోధనలు ఉండాలని సూచించారు. ప్రత్యేకించి విద్యార్థులు రసాయనశాస్త్రం అంటే అనవసర భయాన్నిపెంచుకుంటున్నారని, ఈ శాస్త్రంపై అవగాహన పెంచుకోవడం ద్వారా వినూత్న పరిశోధనలకు కృషి చేయడం సాధ్యమని చెప్పారు. సదస్సులో భువనేశ్వర్, బర్హంపూర్, ఎస్ఆర్ఎం, గీతం, విజ్ఞాన్ యూనివర్శిటీల్లోని ఐఐటీలకు చెందిన కెమిస్ట్రీ ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, రసాయన విభాగం హెచ్‌వోడీ లక్ష్మీమంగమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన



అడ్డాకులు నెత్తిన పెట్టుకుని.. మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న మహిళలు

రావికమతం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొండ శిఖర గ్రామాల్లో ఆదివాసీలకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని మూడు గ్రామాల ఆదివాసీ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నేరేడుబంద గ్రామంలో నెత్తిన అడ్డాకులు పెట్టుకుని వినూత్నంగా ర్యాలీ చేశారు. అనంతరం మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ శివారులో కొండలపై ఉన్న నేరేడుబంద, జీలుగులోవ, సోంపురంబంధ గిరిజన గ్రామాలు ఉన్నాయని, కొండ పోడు సాగుతో సామలు, పసుపు, అల్లం, జీడిమామిడి, మెట్టు చిరుధాన్యాల పంటలపై గిరిజనులు ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వారంతా ఉపాధి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పనులు కల్పించాలని జనవరి 22న ధర్నా చేయగా, మర్రి శ్రీను ఒక్కరికే జాబ్ కార్డును ఇక్కడ అధికారులు పునరుద్ధరించారని చెప్పారు. మిగిలిన ఆదివాసీలకు జాబ్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు స్పందించి అర్హత కలిగిన ఆదివాసీలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయడంతో పాటు 150 రోజుల ఉపాధి పనులను ఆయా గ్రామాల్లోనే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 25న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కిలో కుమారి, డిప్పల చిలకమ్మ, డిప్పల అప్పారావు, పాంగి శరన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

చీడికాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కంచి రాము, చొక్కాకుల భగవంతుడు కుటుంబాలకు టీడీపీ నాయకులు బాసటగా నిలిచారు. ఎంపీటీసీ సభ్యుడు బీశ్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, బొడ్డు శ్రీరామ్మూర్తి, హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ జాజిమొగ్గల వెంకటరమణ తదితరులు బాధితుల్ని పరామర్శించి రూ.15 వేలు నగదు, వస్త్రాలు అందజేశారు. బాధితులకు ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



బాధితులకు నగదు, వస్త్రాలు అందిస్తున్న నాయకులు

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ మంచాల మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశాలకు 'ఆన్‌లైన్'లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల హెచ్ఎం చెరకాపు వెంకటలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈ ఏడాది ఐదో తరగతి పూర్తిచేసి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసే విద్యార్థులు మార్చి 31 వరకు అవకాశం ఉందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుం చెల్లించి ఏప్రిల్ 20న జరిగే పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం 8179384669 నంబర్‌కి ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

ఫీజు పోరును జయప్రదం చేయాలి

చీడికాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 12న జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు కోరారు. సోమ వారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

నాతవరం ఉపాధ్యాయులకు అందని జీతాలు

నాతవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఇప్పటికీ జీతాలు అందలేదు. మార్చి నెల 10వ తేదీ వచ్చినప్పటికీ ఫిబ్రవరి నెల జీతాలు అందలేదని ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. సకాలంలో జీతాల బిల్లులు అందించకపోవడమే ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. మిగతా మండలాల్లో నాలుగు రోజుల క్రితమే ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. అధికారులు స్పందించి నాతవరం మండలంలో పనిచేసే ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇవ్వాలని కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం

మాడుగుల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శతకంపట్టు సమీపంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వాధ్యులతో పాటు కంటి పరీక్షలు కూడా చేయనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని వారు కోరారు.

నేడు దేవతల విగ్రహాల ప్రతిష్ఠ

చీడికాడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునివలస గ్రామంలో బుధవారం సీతారామాంజనేయ వినాయక లక్ష్మీదేవిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు పి.బాలకృష్ణ, పాల సంఘం అధ్యక్షులు పి.కొండబాబు, పేరపు సత్యనారాయణ, పడాల శివతో పాటు పలువురు గ్రామ పెద్దలు ఆదివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలు, భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. కోలాటాలు, తప్పెట గుళ్లతో పాటు సాయంత్రం 4 గంటలకు జిల్లా స్థాయి ఎడ్లపరుగు పోటీలు, రాత్రికి సీతారామాంజనేయ యుద్ధం గయోపాకాల్యాణం కాకీ సీటు ఘనంగా జరుగుతాయని వారు తెలిపారు.

గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర

రోలుగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపేట, ఎంకేపట్నం గ్రామాల్లో సీపీఎం నాయకులు సోమవారం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ పెదపేట గ్రామానికి డ్రైనేజీ లేక నీరు ఎక్కడిక్కడ నిల్వ ఉండిపోయి సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయన్నారు. ప్రభుత్వం గ్రామానికి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రోలుగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొండపై వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 9 ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 14 వరకు జరుగుతాయి. దీనిలో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, ఆలయ ధర్మకర్తలు దివంతగత ముత్యాల రామస్వామి కుటుంబీకులు పాల్గొన్నారు.

ఊబకాయం...

సమస్యలు అనేకం



- 2050 నాటికి దేశంలో 44 కోట్ల మంది...
- గడచిన నెల రోజుల్లో రెండుసార్లు ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన
- వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని సూచన
- ఒబెసిటీతో మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానంతో పరిష్కారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"దేశంలో ఊబకాయం సమస్య తీవ్రమవుతోంది. 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులుగా మారతారని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయంతో అవస్థలు పడే ప్రమాదం ఉంది. ఇది నిజంగా ప్రమాదకరమైన, దిగ్భ్రాంతిని కలిగించే విషయం. ఒబెసిటీ అతిపెద్ద సవాల్‌గా మారుతోంది. ఊబకాయ సమస్యను అధిగమించేందుకు వంట నూనెల వినియోగాన్ని కనీసం పది శాతం తగ్గించుకోండి'...అంటూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఊబకాయ సమస్య గురించి ఆయన రెండోసారి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో అసలు ఊబకాయం బారినపడేందుకు గల కారణాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అందిస్తున్న కథనం..

ఊబకాయం అంటే శరీర బరువు పెరగడం మాత్రమే కాదు. శరీరాన్ని రోగాల మయం చేసే అతిపెద్ద సమస్యగా దీనిని చూడాలని వైద్యులు చెబుతున్నారు. ఒబెసిటీ అంటే శరీరంలో తీవ్రస్థాయిలో కొవ్వు పేరుకుపోవడమే. పరిధికి మించి కొవ్వు పెరిగితే మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ప్రాథమిక దశలోనే బరువు పెరుగుతుం డడాన్ని గుర్తించి అప్రమత్తం కావడం ద్వారా ఊబకాయం బారినపడకుండా చూసుకోవచ్చునం టున్నారు.

ఇవీ కారణాలు..

గతంతో పోలిస్తే ఒబెసిటీ పెరగడానికి మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానమే కారణంగా వైద్యులు చెబుతున్నారు. గతంలో ఇంట్లో వండిన ఆహార పదార్థాలు తినేవాళ్లు. ఇప్పుడు బయట ఆహారాన్ని అధికంగా తింటున్నారు. కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పిజ్జాలు, బర్గర్లు, ఆయిల్‌లో చేసిన ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్ వంటివి తీసుకోవడం వల్ల కొవ్వు శరీరంలో స్థాయికి మించి పేరుకుపోతోంది. దాంతోపాటు శారీరక శ్రమ తగ్గడం, రాత్రివేళల్లో ఆహార పదార్థాలు తినడం, అర్ధరాత్రి దాటిన తరువాత కూడా నిద్రపోకపోవడం, తీవ్రమైన ఒత్తిడి వంటివి ఒబెసిటీకి కారణాలుగా చెబుతున్నారు.



శరీరంలో పెరిగే కొవ్వు వల్ల..

శరీరంలోని వివిధ భాగాల్లో పేరుకుపోయే కొవ్వు వల్ల ఒబెసిటీ వస్తుంది. సాధారణంగా ఒబెసిటీని బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ద్వారా నిర్ధారిస్తారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో బీఎంఐ 30 ఉంటే ఒబెసిటీగా చెబుతారు. కానీ, భారత్‌లోని ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల 20.9 బీఎంఐ ఉంటే అధిక బరువుగా, 25 బీఎంఐ ఉంటే ఒబెసిటీగా చెబుతారు. 25 నుంచి 30 వరకు మొదటి దశ, 30 నుంచి 35 వరకు రెండో దశ, 35 దాటితే సమస్యగా పరిగణిస్తారు. వీరికి వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది.

కేజీహెచ్‌కు భారీగా రోగులు

కేజీహెచ్‌లోని ఎండోక్రైనాలజీ విభాగానికి వారానికి సుమారు వేయి మంది వరకు వస్తుంటారు. అందులో దాదాపు 350 మంది వరకూ అధిక బరువు, ఒబెసిటీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లో అయితే ఈ సమస్య మరింత అధికంగా ఉంటోంది. ప్రతివారం 60 మంది పిల్లలు వస్తే అందులో దాదాపు 25 నుంచి 30 వరకు ఒబెసిటీ సంబంధిత లక్షణాలతో బాధపడుతున్నట్టు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారుల్లో ఈ సమస్య మరింత అధికంగా ఉంటోందని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో వంద మందిలో 15 మందికి ఒబెసిటీ ఉంటే, ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారుల్లో 50 శాతం మందిలో ఈ సమస్య ఉంటున్నట్టు చెబుతున్నారు. దీనికి ప్రధానమైన కారణం పాఠశాలల్లో ఆటలు ఆడించకపోవడం, వ్యాయామం చేయించకపోవడమే కారణంగా చెబుతున్నారు.

చెక్ చెప్పడం ఇలా..?

ఒబెసిటీ బారినపడకుండా, ఒకవేళ బరువు పెరుగుతున్నా తగ్గించుకునే మార్గాలు కూడా ఉన్నాయి. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. బయట ఆహారానికి, పిజ్జాలు, బర్గర్లు, ఆయిల్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకూ ఇంట్లో చేసుకునే ఆహారాన్ని తీసుకోవాలి. శరీరంలో పెరిగే కేలరీలను కరిగించేందుకు వ్యాయామం చేయాలి. పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, వేపుళ్ల వంటి వాటికి దూరంగా ఉండాలి. ప్రతిరోజూ కనీసం ఆరు నుంచి ఏడు గంటలు నిద్రపోవాలి. వీలైనంత వరకూ రాత్రి ఏడు గంటలలోపు డిన్నర్ పూర్తిచేయాలి. స్వీట్స్, కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.

ఆరోగ్యకరమైన అలవాట్లతోనే ఒబెసిటీకి దూరం



ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో ఒబె సిటీకి దూరంగా ఉండవచ్చు. గడిచిన కొన్నాళ్లగా ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉండడంతో బయట ఆహారం అధికంగా తీసుకుంటున్నారు. ఇంట్లో వంటలు తక్కువగా చేస్తున్నారు. దీనివల్ల ఒబెసిటీ సమస్య పెరుగుతోంది. ముఖ్యంగా జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్స్, సాఫ్ట్ డ్రింక్స్ వల్ల పిల్లల్లో ఈ సమస్య గణనీయంగా పెరుగుతోంది. మహిళల్లో దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరు అధిక బరువు, ఒబె సిటీతో బాధపడుతున్నారు. వీలైనంత వరకూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవడం, శారీరక శ్రమ ద్వారా ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. గతంతో పోలిస్తే ఆయిల్స్ వినియోగం కూడా అధికమైంది. ఇది కూడా ఒబెసిటీకి కారణమవుతోంది. అందువల్ల నూనె వినియోగం బాగా తగ్గించాలి. ఆయిల్‌లో బాగా ఫ్రై చేసిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

- డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి



మృతిచెందిన సూర్య లక్ష్మీనారాయణ

పరవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణికం పెదచెరువులో చేపలు పట్టేందుకు దిగి గల్లంతైన బలిరెడ్డి సూర్యలక్ష్మీనారాయణ మృతదేహాన్ని సోమవారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం వెలికితీసింది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గ్రామానికి చెందిన ఐదుగురితో కలిసి సూర్యలక్ష్మీనారాయణ చెరువులో చేపలు పట్టేందుకు దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. పోలీసులు మత్స్యకారులను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం ఉదయం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రబ్బర్ బోటుతో చెరువులోకివెళ్లి గాలించి సూర్యలక్ష్మీనారాయణ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ బి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో 25 ఏళ్ల కఠినకారాగార శిక్ష

- మూడున్నరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముద్దాయి

విజయనగరం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడి కేసులో ముద్దాయికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి తీర్పు చెప్పినట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి. గంట్యాడ మండలం కొఠారుబిల్లి జంక్షన్ వద్ద గత ఏడాది అక్టోబరు 27న జరిగిన ఓ శుభకార్యానికి అనకాపల్లికి చెందిన ఓ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఇదే సమయంలో కొఠారుబిల్లికి చెందిన విసినిగిరి రవి (31) మూడున్నర సంవత్సరాల బాలికను ఫంక్షన్ హాలు సమీపంలోని టింబర్ డిపో వెనుక్కు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకులు విజయనగరం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని కొద్ది గంటల్లోనే అరెస్టు చేశారు. న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసి ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో నిందితుడు విసినిగిరి రవిపై నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ తరగతులు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి మార్పులు, చేర్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకూ ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత సెలవులు ఇస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభిస్తున్నారు. సెలవుల్లో ప్రైవేటు కళాశాలలు మాత్రం ప్రవేశాలు, తరగతులు నిర్వహిస్తుండేవి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. అంతేగాకుండా ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. దీనిని అధిగమించడానికి ఈసారి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం క్లాసులు ప్రారంభించనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలున్నందున వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ క్లాసులు మొదలుపెట్టనున్నారు. ఏప్రిల్ 7 నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించానున్నారు. పదో తరగతి పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటర్ మొదట సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవచ్చు. ఏప్రిల్ 23 వరకు క్లాసులు, ప్రవేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1 వరకు సెలవులు ప్రకటించారు. మళ్లీ జూన్ 2 నుంచి యథావిధిగా క్లాసులు ప్రారంభమవుతాయి. దీనివల్ల ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు నిర్వహించే తరగతుల్లో 15 శాతం సిలబస్ పూర్తిచేస్తారు. మొత్తం సిలబస్‌ను కూడా డిసెంబరు 31 తేదీకంటే ముందే పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సైన్స్ గ్రూపు విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌లకు శిక్షణ ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహించి, 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ, ఎంసెట్ శిక్షణ కల్పించనున్నారు.

విశాఖ ఉమ్మడి జిల్లాలో 68 సాంఘిక, గిరిజన సంక్షేమ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఏటా దాదాపు 13 వేల మంది విద్యార్థులు చేరుతుంటారు. వచ్చే నెల నుంచే ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధ్యాపకులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రవేశాల్లో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కొనసాగించి ఫెయిలైన వారికి తొలగిస్తారు.

పేదల ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

మరెక్కడా సొంత ఇంటి జాగా లేకపోతేనే క్రమబద్ధీకరణ చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గతంలో స్థలం/ఇల్లు పొందివుంటే ఈ పథకం వర్తించదు. అన్ని అర్హతలు ఉంటే సంబంధిత కుటుంబంలో మహిళ పేరుతో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీచేసి రిజిస్ట్రేషన్ చేస్తారు. పట్టా జారీ చేసిన రెండేళ్ల తరువాత డి.పట్టాతోపాటు కన్వేయర్ డీడ్‌ను పేదలకు ఉచితంగా అందించనున్నారు. జిల్లాలో అన్ని వార్డు/ గ్రామ సచివాలయాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వీఆర్‌ఓ, సర్వేయర్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం తహసీల్దార్లకు నివేదిక అందజేస్తారు. ఆర్డీఓ/ సబ్‌కలెక్టర్, టౌన్‌ప్లాన్ అధికారి, తహసీల్దారు సభ్యులుగా ఉండే అప్రూవల్ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

వేగంగా పీ-4 సర్వే

... 5వ పేజీ తరువాయి

చేయడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు జిల్లా పంచాయతీరాజ్ ఈఈ వీరంనాయుడు, డ్వామా పీడీ పి.పూర్ణిమదేవి, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, జడ్పీ సీఈఓ నారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎఎస్‌ఏ రామస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం

... 5వ పేజీ తరువాయి

వంగలపూడి అనిత స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు కుమారుడు, కుమార్తెతో కలిసి పట్టువస్త్రాలను శిరస్సుపై మోస్తూ ఆలయంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులకు అందజేశారు. గోత్రనామాలతో అర్చకులు పూజా కార్యక్రమాలు చేసి మంత్రికి వేద ఆశీర్వచనం చేశారు. ఆమె వెంట ఆలయ మాజీ చైర్మన్లు కొండబాబు, పెంకులరాజు, ఆకేటి గోవిందరావు, కొప్పిశెట్టి బుజ్జి, కూటమి నాయకులు వెంకటేశ్, లాలం కాశీనాయుడు, కోసూరి శ్రీను, గుర్రం రామకృష్ణ, ఆకేటి గోవిందరావు తదితరులు వున్నారు.

ఘనంగా ధ్వజారోహణం

కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం బంగారు ఆభరణాలు ధరించిన స్వామివారి ఉత్సవమూర్తులను, సుదర్శన పెరుమాళ్‌ను పెద్దపల్లకీలో అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. తదుపరి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, రాజగోపాలాచార్యులు, యువీఎస్ రావు, రంగబాబు, పవన్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా కలెక్టర్ విజయకృష్ణన్, డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా, తదితర అధికారులు సోమవారం సాయంత్రం ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి, వేద ఆశీర్వచనం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

అనకాపల్లి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి నిర్వహించే మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలో బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. పూరించిన దరఖాస్తుకు కులధ్రువీకరణ, నేటివిటీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో టెట్ అర్హత పత్రాన్ని జతచేసి అనకాపల్లిలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 98858 45743, 82470 36596 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె తెలిపారు.

గుండెపోటుతో ఇన్విజిలేటర్ మృతి



మాధవరావు (ఫైల్)

భీమునిపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా విధులకు హాజరైన ఉపాధ్యాయుడు డబ్బీరు మాధవరావు (55) గుండెపోటుతో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. తన బైక్‌పై మాధవరావు సోమవారం ఉదయం సుమారు 7.45 గంటలకు కళాశాలకు వచ్చారు. వరండాలో ఆఫీస్ గది వద్ద గల బెంచీపై కూర్చున్నారు. ఆ సమయంలో ఆఫీసులో గుమస్తాలు చక్రవర్తి, సుజాత, ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అవసరమైన పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈలోగా వరండా పెద్ద శబ్దం వినిపించడంతో పరుగున వెళ్లిచూడగా...మాధవరావు కూర్చున్న బెంచీకి, గోడకు మధ్యలో పడిపోయి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కొద్దిసెకన్లకే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ఆయనకు సిబ్బంది సీపీఆర్ చేయగా, కళ్లు తెరిచారు. ఆయన తనయుడు సుధీర్‌కు సమాచారం అందించడంతో ఆటోలో కాలేజీకి చేరుకున్నారు. వెంటనే సమీపంలోని చిన్నబజారు జంక్షన్‌లో ఉన్న ఒక ప్రైవేటు డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా...ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించారు. అక్కడి నుంచి సంగివలస ఎన్నారై ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగానే తుదిశ్వాస విడిచారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో మాధవరావు మృతిచెందారని వైద్యులు తెలిపారు. మాధవరావు ఇటీవల భీమిలి మినీ స్టేడియం వెనుక ఉన్న అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. అక్కడే నివాసం ఉంటూ మండలంలోని రేఖవానిపాలెం ఎంపీపీ పాఠశాలలో ఎస్‌జీటీ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్విజిలేటర్ మృతిచెందినట్టు సమాచారం అందడంతో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐఓ మురళీధర్, డీవీఈఓ రాధ భీమిలి చేరుకున్నారు. కళాశాల అధ్యాపకులు, మండల విద్యాశాఖాధికారులు ఎం.శివరాణి, ఎ.జయప్రద మృతుని నివాసానికి వెళ్లి సంతాపం తెలిపి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ
- పలువురితో మాట్లాడిన కలెక్టర్
- ప్రతి సమస్యపై దృష్టి సారించాలని ఆదేశం



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందిన అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డీఆర్‌వో సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురితో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తొలుత ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అప్పుడే ఈ కార్యక్రమంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. అధికారులు వారి శాఖలకు సంబంధించి అందిన అర్జీల పరిష్కార విషయంలో సిబ్బందితో రోజువారీ సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 440 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. పాయకరావుపేట మండలం పడాలవాని లక్ష్మీపురం (పీఎల్‌పురం) గ్రామానికి చెందిన పదిల సీతయ్యమ్మ అనే వృద్ధురాలు వీల్‌చైర్‌పై కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. కోర్టు పరిధిలో ఉన్న తన భూమిని జేసీ ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి పదిల వెంకటేశ్వరరావు పేరు మీద వన్‌బి, ఎల్‌పీ నంబర్ మంజూరు చేసిన తహసీల్దార్, వీఆర్‌వో, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

జిల్లా పోలీస్ కార్యాలయానికి 31 అర్జీలు

అనకాపల్లి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను నిశితంగా పరిశీలించాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అర్జీల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 31 అర్జీలు అందగా వాటిలో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితరాలు ఉన్నట్టు విభాగాధికారులు తెలిపారు.

ఉపమాకలో తిరుపతి లడ్డూల విక్రయం



లడ్డూ ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో దాదాపు ఎనిమిది సంవత్సరాల తరువాత తిరుపతి లడ్డూ ప్రసాదాలు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాల సందర్భంగా సోమవారం లడ్డూ ప్రసాదాల విక్రయాలను ప్రారంభించారు. ఈ ఏడాది వెంకన్న కల్యాణోత్సవాల సమయంలో తిరుపతి లడ్డూ ప్రసాదాలను భక్తులకు అందుబాటులో వుంచాలని హోం మంత్రి అనితను స్థానిక నాయకులు కోరారు. ఆమె ఈ విషయమై టీటీడీ ఈవో, చైర్మన్‌లతో మాట్లాడారు. దీంతో సోమవారం లడ్డూ ప్రసాదాల విక్రయాలను ప్రారంభించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు ఉపమాక వేంకటేశ్వరస్వామి ముఖచిత్రంతో ముద్రించిన క్యాలెండర్లను హోం మంత్రి అనిత అవిష్కరించారు. ఆమె వెంట ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకులు వెంకటేశ్, కొండబాబు, కురందాసు నూకరాజు తదితరులు వున్నారు.



స్వామివారి సన్నిధిలో మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, డీఐజీ గోపీనాథ్, ఎస్పీ తుహిన్‌సిన్హా

పవన్ నిర్ణయంతో రాష్ట్రం దశ, దిశ మారాయి

- మంత్రి నాదెండ్ల మనోహర్



సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్. వేదికపై ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ

నక్కపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కష్టకాలంలో వున్నప్పుడు, విధ్వంస పాలనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పుడు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని, ఈ నిర్ణయంతోనే ఇప్పుడు రాష్ట్రం దశ, దిశ మారుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం రాత్రి జనసేన నేత గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో గొడిచెర్ల వద్ద నిర్వహించిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఆలోచనలు చాలా గొప్పవని, ఆయన ఏ విషయమైనా క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే తప్ప మాట్లాడరని అన్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్మోహన్‌రెడ్డిపై కోడికత్తితో దాడి.. ఒక నాటకమని తేలిపోయిందన్నారు. జనసేన అధినేత పవన్‌ను విమర్శించే నైతిక అర్హత జగన్‌కు లేదని, ఆయన కోడికత్తికి ఎక్కువ, గొడ్డలికి తక్కువని ఎద్దేవా చేశారు. గెడ్డం బుజ్జి మాట్లాడుతూ, హోం మంత్రి అనితకు, తమకు మధ్య ఎటువంటి గ్యాప్ లేదని, ఇద్దరం సమన్వయంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, పంతం నానాజీ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.